సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 27 । మార్చి । 2023



'కేంద్రీయ'లో ప్రవేశాలు 8లో▸

కేంద్రీయ విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశానికి నేటి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.



ప్లాట్లుగా మారుతున్న రోడ్లు

బేలలో ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఅవుట్‌లోని 20ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేసి కొత్త లేఅవుట్ సృష్టించారు. ఆర్టీసీ బస్టాండ్ స్థలంలోకి ఆ రోడ్డును మళ్లించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.1/21.4

వాతావరణం

ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ, వేడి ఉంటుంది. సాయంత్రం పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ సోమ : 6:35 | సహర్ మంగళ 4:51

న్యూస్‌రీల్

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



దివ్యాంగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తూ అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో దివ్యాంగుల పరికరాల ఎంపిక సదస్సు నిర్వహించారు. వైద్య నిపుణులు దివ్యాంగులను పరిశీలించి వారికి ఏ రకమైన పరికరాలు అవసరమనేది గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు గుర్తించిన పరికరాలను త్వరలోనే దివ్యాంగులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ముఖ్య న్యాయవాది దాసరి గంగారాం, ఉప న్యాయవాది అశోక్, సహాయ న్యాయవాది ఉమేష్ దోలే, న్యాయవాది వెండి భద్రేశ్వర రావు, వైద్యులు అనిల్ చిద్రాల, ఆడియాలజిస్ట్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సాత్నాల'లో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

జైనథ్(ఆదిలాబాద్): మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్ సమీప గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకోవడంతో మాంగుర్ల, సుందరగిరి, మేడిగూడ, కాన్స, తదితర గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లగా మారింది. కొన్ని రోజులుగా మండలంలో అక్కడక్కడా తేలిక పాటి జల్లులు కురుస్తున్నప్పటికీ పెద్దగా వర్షాలు లేవు. వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు, పశు, పక్షాదులు ఈ వర్షంతో కొంత ఉపశమనం పొందారు.

బజార్‌హత్నూర్: మండలంలో మొక్కజొన్న, దనియ, రబీ జొన్న, శనగ పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, జొన్న పంటలు నేలవాలాయి. శనగ పంట తడిసిపోయింది.

నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ మోసాన్ని ఎండగడుతూ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికిన బీజేపీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా మాదిగలను మోసం చేస్తోందన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 31న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు గంగన్న, సుభాష్, సూర్యకాంత్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన

ఆదిలాబాద్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చిక్కిలి రాధాకృష్ణ మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి పర్వదినం రోజు నిర్వహించే కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



తాంసి మండల కేంద్రంలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులు

హడావుడిగా పనులు

- ముంచుకొస్తున్న గడువు..
- ఆర్థిక సంవత్సరం చివరలో సీసీరోడ్లు మంజూరు
- పూర్తి చేసేందుకు మల్లగుల్లాలు పడుతున్న సర్పంచులు
- సకాలంలో చేయకుంటే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం
- పనుల నాణ్యతపై సందేహాలు

జిల్లా వివరాలు

మండలాలు	17
గ్రామ పంచాయతీలు	468
మంజూరైన సీసీరోడ్లు	497
ప్రారంభంకాని సీసీరోడ్లు	162
మంజూరైన డ్రెయినేజీలు	26

కైలాస్‌నగర్: గ్రామాల అభివృద్ధిలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు మంజూరైన సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు సర్పంచులకు తలనొప్పిగా మారాయి. ఆర్థిక సంవత్సరం చివరి దశలో మంజూరైన ఈ పనులను పూర్తి చేసేందుకు వారు మల్లగుల్లాలు పడుతున్నారు. మరో నాలుగు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండటం, ఈలోగా పనులను చేపట్టకుంటే నిధులు రద్దయ్యే అవకాశంం ఉండడంతో ఆఘమేఘాల మీద హడావుడిగా పనులు కానిచ్చేస్తున్నారు. దీంతో పనుల నాణ్యతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏకకాలంలో వందలాది పనులు చేపడుతుండటంతో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపించి పనుల నాణ్యతను ప్రశ్నార్థకంగా మార్చుతోంది. ఇంకా పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించకపోవడంతో నిర్దిష్ట గడువులోగా అవి పూర్తవుతాయా? లేక నిధులు రద్దవుతాయా? అనే సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

జిల్లాకు 497 సీసీరోడ్లు మంజూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు రూ.43.73 కోట్ల వ్యయంతో 497 సీసీరోడ్లు మంజూరయ్యాయి. బోథ్ నియోజకవర్గానికి రూ.16.33 కోట్ల వ్యయంతో 201, ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.16.88కోట్ల వ్యయంతో 133, ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలకు రూ.8.6కోట్ల వ్యయంతో 115, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గాదిగూడ, నార్నూర్ మండలాలకు రూ.192 కోట్ల వ్యయంతో 48 సీసీరోడ్లు మంజూరయ్యాయి. ఒక్క ఆదిలాబాద్ నియోజకవర్గానికి మాత్రమే ఈజీఎస్ నిధులతో 26 డ్రెయినేజీలు మంజూరయ్యాయి. ఇందులో జైనథ్‌కు 14, బేలకు 5, ఆదిలాబాద్ రూరల్‌కు 7 చొప్పున మంజూరు చేశారు. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు ఈ నిధులు దోహదపడనుండగా ఆర్థిక సంవత్సరం చివరిదశలో మంజూరు కావడంతో వాటి నిర్మాణాలు ఎలా పూర్తిచేయాలోనని సర్పంచులు మల్లగుల్లాలు పడుతున్నారు.

నాణ్యతపై సందేహాలు..

గడువులోగా పనులు పూర్తిచేయాలనే ఉద్దేశంతో సర్పంచులు గ్రామాల్లో హడావుడిగా సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఏకకాలంలో వందలాది పనులు కొనసాగుతున్నాయి. మండలానికి ఒకే ఏఈ ఉండడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడుతోంది. కొన్నిచోట్ల వారు పరిశీలించకుండానే కిందిస్థాయి ఉద్యోగులచే ఎంబీలను రికార్డు చేయిస్తున్నారు. దీంతో పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొంతమంది అధికారులు మామూలుగా తీసుకుంటూ పనులను పరిశీలించకుండానే ఎంబీలను రికార్డు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కేటాయించే నిధులతో పది కాలాల పాటు నిలవాల్సిన సీసీరోడ్లు పట్టుమని పది నెలలు దాటకముందే పగుళ్లుతేలి పనికిరాకుండా పోతున్నాయి. ఇందుకు ఇది వరకు చేపట్టిన సీసీరోడ్లే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇందుకు అధికారుల నిర్వాకమే కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రారంభంకాని 162 నిర్మాణాలు

2022-23 ఆర్థిక సంవత్సరం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఈలోగా జిల్లాకు మంజూరైన సీసీరోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇంకా 162 సీసీరోడ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. దీంతో నిర్దిష్ట గడువులోగా ఈ పనులు పూర్తిచేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 497 నిర్మాణాలకుగానూ 132 ప్రగతిలో ఉండగా 213 పూర్తయ్యాయి. అందులో 194 పనులకు సంబంధించి రూ.1,569.43లక్షల బిల్లులను రికార్డు చేశారు. ఇందులో 175 పనులకు సంబంధించిన బిల్లులను ఈఈ ఆఫీసులో అందజేశారు. ఇంకా రూ.2,803.55లక్షలకు సంబంధించిన సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే సమయం లేకపోవడంతో వాటిని ఏవిధంగా పూర్తిచేయాలనే దానిపై సర్పంచుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు కొన్నిచోట్ల స్వయంగా వారే పనులు చేపడుతుండగా మరికొన్ని చోట్ల తమ సన్నిహితులు, ఇతర రాజకీయ నాయకుల ద్వారా చేయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డ్రెయినేజీల నిర్మాణాలు సైతం ఇంకా ప్రారంభించలేదు.

సకాలంలో పూర్తిచేస్తాం

జిల్లాకు మంజూరైన సీసీరోడ్లు, డ్రెయినేజీలను గడువులోగా వందశాతం పూర్తిచేస్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. పనులు నాణ్యతగా ఉండాలని అధికారులను ఆదేశించాం. ఏఈలు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించి ఎంబీలను రికార్డు చేస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకుండా చూస్తున్నాం. నాణ్యత ప్రమాణాల ప్రకారంగా పనులు జరిగేలా చూస్తున్నాం.

– మహవీర్, పీఆర్ ఈఈ

టాప్ 'టెన్'లో ఉంటాం..

- ఏప్రిల్ 3 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో ప్రణీత



ప్రణీత, డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించి టాప్ 'టెన్'లో ఉంటాం.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. విషయ నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. మెటీరియల్ కరదీపికను కూడా పంపిణీ చేశామన్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఏప్రిల్ 3 నుంచి 12 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సాక్షి: మెరుగైన ఫలితాల సాధనకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఈవో: పదో తరగతి పరీక్షల్లో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. ఉదయం, మధ్యాహ్నం ప్రత్యేక తరగతులు బోధిస్తున్నాం. పాఠశాలలో బోధన సమయంలో విద్యార్థులకు స్నాక్స్, రాగి జావ అందిస్తున్నాం. గ్రూపులుగా విభజించి చదువులు కొనసాగిస్తున్నాం. రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదివించాలని సూచిస్తున్నారు. పరీక్షలు అయ్యేంత వరకు టీవీ, సెల్‌ఫోన్‌లు, శుభకార్యాలు, విందులు, వినోదాలకు దూరంగా ఉంచాలని సూచిస్తున్నాం.

సాక్షి: గతేడాది ఫలితాలు ఎలా ఉన్నాయి? ఈసారి ఎన్నోస్థానంలో ఉండవచ్చు?

డీఈవో: గతేడాది 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు 9వ స్థానం దక్కింది. ప్రస్తుతం మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేపట్టాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వంద రోజుల ప్రణాళికను తయారు చేశాం.

సాక్షి: ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

డీఈవో: రెగ్యులర్ విద్యార్థులు 10,608, ప్రైవేట్ విద్యార్థులు 91 మంది మొత్తం 10,699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 5,260, బాలికలు 5,347 మంది ఉన్నారు. జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

డీఈవో: వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. కలెక్టర్ అధ్యక్షతన సమావేశం కూడా నిర్వహించాం. పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వైద్యసేవలు, బెంచీలు ఏర్పాటు చేస్తాం. ఏఒక్క విద్యార్థికి సమస్య ఎదురుకాకుండా చర్యలు చేపడతాం.

సాక్షి: పరీక్ష నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?

డీఈవో: 54 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 13 మంది కస్టోడియన్‌లు, 545 మంది ఇన్విజిలెటర్లను నియమించాం. ఇప్పటికే రెండు సెట్ల ప్రశ్న పత్రాలు వచ్చాయి. వాటిని పోలీసు స్టేషన్‌లో భద్రపర్చాం.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సలహా?

డీఈవో: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి జీపీఏ సాధిస్తారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. పదో తరగతి పరీక్షలు విద్యార్థి భవిష్యత్తుకు తొలిమెట్టు. ఇక్కడ మంచి మార్కులు సాధిస్తేనే భవిష్యత్తు బంగారు బాట అవుతుంది. తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించాలి. ఒకరోజు ముందు పరీక్ష కేంద్రాలను సందర్శించాలి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం హాల్‌టిక్కెట్ ఇవ్వకపోతే bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్‌రూం నంబర్ 08732-226434లో సంప్రదించాలి.

నేడు కాంగ్రెస్ ఒక్కరోజు దీక్ష

ఎదులాపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ఆల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం ఒక్కరోజు దీక్ష చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తమ నివాసం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ దీక్ష చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిధులు కేంద్రానివేనని నిరూపించాలి

- బీజేపీ నాయకులకు ఎమ్మెల్యే జోగు రామన్న సవాల్

కైలాస్‌నగర్: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్న నిధులు కేంద్రానివే అయితే బీజేపీ నాయకులు నిరూపించాలని ఎమ్మెల్యే జోగు రామన్న సవాల్ విసిరారు. పట్టణంలోని 20వ వార్డు భాగ్యనగర్‌లో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. పలువురు లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిరాదరణకు గురైన ప్రాంతాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్లు సంజయ్, భూమన్న పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

వడ్డెర కులస్తుల అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: వడ్డెర కులస్తుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం సింహగర్జనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, నేషనల్ లేబర్ బోర్డు డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి జిల్లాలోని వడ్డెర కులస్తుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వడ్డెర కులస్తులు సొసైటిగా ఏర్పడి బీసీ కార్పొరేషన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సొసైటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. 18 సంవత్సరాలు పైబడి 50 సంవత్సరాల లోపు ఉన్న ప్రతిఒక్కరూ లేబర్ శాఖ నుంచి కార్డులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రమేశ్, అర్జున్, మారుతి, వెంకటేశ్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

పర్ధాన్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: పర్ధాన్ సమాజ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడావి శంకర్, గౌరవ అధ్యక్షునిగా అర్క నగేష్, ప్రధాన కార్యదర్శిగా ఆడ నగేష్, ఉపాధ్యక్షులుగా మెస్రం నగేష్, వడ్డి దత్తు, కుమ్ర శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గేడం నాందేవ్, సంయుక్త కార్యదర్శులుగా కోవ విజయ్, ఉయిక నగేష్, కుర్సింగే గంగాధర్, కోశాధికారిగా ఆత్రం మధుసూదన్, సాంస్కృతిక కార్యదర్శిగా ఆత్రం కృష్ణమూర్తి, మహిళా ప్రతినిధిగా సిడాం శ్యామల, మీడియా కార్యదర్శిగా మడావి జయకర్, కమిటీ సభ్యులుగా మెస్రం రవీందర్, సిడాం లింగోరావ్, గేడం బలిరాం, పెందోర్ మహాదేవ్, మెస్రం దీపక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.వామన్‌రావ్, నైతం గణేశ్, నాయకులు గేడం తుల సీరాం, కొచాడే నారాయణ, ఉయిక విఠల్, గేడం విఠల్, కుమ్ర హన్మంతు, గేడం గీత పాల్గొన్నారు.

పులుల మృత్యుఘోష!

- 'కవ్వాల్'లో ఆగని మరణాలు
- వేటగాళ్ల ఉచ్చుకు టైగర్లు బలి
- తాజాగా బెల్లంపల్లి పరిధిలో మరొకటి..
- ఐదేళ్ల క్రితమే చంపినట్లు నిర్ధారణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేటగాళ్ల ఉచ్చుకు మరో పులి బలైంది. కవ్వాల్ పరిధిలో సగటున రెండేళ్లకో పులి చనిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. తాజాగా బెల్లంపల్లి డివిజన్ కుశ్నపల్లి రేంజ్ నెన్నెల సెక్షన్, రంగపేట బీట్ పరిధిలో ఓ పులిని విద్యుత్ ఉచ్చుతో హతమార్చినట్లు వెలుగుచూసింది. దాని అవశేషాలు పాతిపెట్టి గోర్లు విక్రయిస్తుండగా దుండగులు అటవీశాఖ టాస్క్‌ఫోర్స్‌కు చిక్కారు. ఈ పులిని చంపి కొంతకాలంగా ఎవరికంట పడకుండా తప్పించుకున్నారు. అయితే పులి గోర్లు విక్రయానికి వచ్చాయనే పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఇది బయటపడింది. దీనిని కొన్నేళ్ల క్రితమే చంపినా అటవీ అధికారులకు సమాచారం లేకపోవడం ఆ శాఖ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది.

చనిపోయింది ఏ పులి?

గడిచిన ఐదేళ్లుగా దాదాపు నాలుగైదు పులులు కనిపించకుండా పోయాయి. కే6, ఏ2, జే1తో పాటు కాగజ్‌నగర్‌లో రెండుదఫాల్లో ఎనిమిది పిల్లలకు జన్మనిచ్చి 'సూపర్ మామ్'గా పేరొందిన 'పాల్గుణ' జాడ కూడా కనిపించడం లేదు. వీటిలో కొన్ని మహారాష్ట్రకు వెళ్లిపోయాయని చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నా వాస్తవానికి ఏ పులి ఎక్కడ తిరుగుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం.

ఎడ్లబండిలో తీసుకెళ్లి పాతిపెట్టి..

విద్యుత్ కంచెకు తగిలి చనిపోయిన పులి కళేబరాన్ని అతికష్టం మీద ఆరుగురు ఎత్తి ఎడ్లబండిలో తీసుకెళ్లి ఎల్లారం అటవీప్రాంతంలోని చెరువు సమీపంలో పాతిపెట్టారు. చనిపోయిన ఈ పులి వయస్సు మూడేళ్లకు పైగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇటీవల అటవీ అధికారులు పోడు భూముల సర్వే పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు సిబ్బంది కొరత, ఉన్నవారు కూడా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పులులకు రక్షణ లేకుండా పోతోందనే వాదనలు ఉన్నాయి.

విద్యుత్ కంచెలకు పులులు బలి..

వన్యప్రాణులను వేటాడేందుకు సులువైన సాధనంగా వేటగాళ్లు రాత్రి వేళ విద్యుత్ కంచె ఏర్పాటు చేస్తున్నారు. ఆ సమయంలో పులి ఆ వైరును తాకితే సెకండ్లలోనే ప్రాణాలు కోల్పోతుంది. ఇలా కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. చనిపోయిన పులి అవశేషాలు విక్రయించే క్రమంలో మాత్రమే ఇవి బయటపడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో హతమైన పులుల వివరాలు..



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పిన్నారంలో పాతిపెట్టిన పులి కళేబరం(ఫైల్)

- 1985లో తొలిసారిగా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని కాగజ్‌నగర్ డివిజన్‌లో సిర్పూర్ నుంచి మాకోడి రైల్వేట్రాక్‌పై ఒక పులి కళేబరం కనిపించింది.
- 2006లో బెజ్జూర్‌లోని పాపన్నపేటలో వేటగాళ్లు పులిని చంపేశారు.
- 2011లో కాగజ్‌నగర్ మండలం ఊట్‌పల్లి చెరువు వద్ద పెద్దపులిని హతమార్చారు. చర్మం, గోర్లను తరలిస్తుండగా అధికారులకు పట్టుబడ్డారు.
- 2010 అక్టోబర్‌లో సిర్పూర్, కౌటాల మండలాలకు చెందిన నలుగురు వేటగాళ్లను మహారాష్ట్రలోని చంద్రాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఇక్కడి అటవీ అధికారులకు అప్పగించారు. విచారణలో హైదరాబాద్ నుంచి పులి చర్మం తీసుకొచ్చినట్లు ఒప్పుకొన్నారు.
- 2014లో చెన్నూరులో పెద్దపులి చర్మం లభ్యమైంది. కారకులను అరెస్ట్ చేశారు.
- 2016లో కాగజ్‌నగర్ డివిజన్ బెజ్జూర్ మండలం ఏటిగూడ సమీపంలో పులి చర్మాన్ని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వేటగాళ్లు సరిహద్దున గల మహారాష్ట్ర నుంచి పులిచర్మంతో వస్తుండగా అరెస్ట్ చేశారు. ఈ పులి చర్మాన్ని బెజ్జూరు రేంజ్‌లోని అటవీశాఖ భవనంలో భద్రపరచగా ఆ శాఖ ఉద్యోగే మాయం చేశాడు. తన ఇంట్లోనే దాచి విక్రయించేందుకు యత్నించే క్రమంలో పట్టుబడ్డాడు.
- 2016లో చెన్నూరు డివిజన్ కోటపల్లి మండలం పిన్నారం రైతులు పొలాల వద్ద అమర్చిన విద్యుత్ కంచెకు తగిలి ఓ పులి చనిపోయింది.
- 2017 జూలైలో మంచిర్యాల జిల్లా జన్నారానికి చెందిన ఐదుగురు రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. పులి చర్మాన్ని హైదరాబాద్‌లో విక్రయించేందుకు వస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.



బెల్లంపల్లి డివిజన్ కుశ్నపల్లి రేంజ్‌లో లభ్యమైన పులి అవశేషాలు

- 2019 జనవరిలో మంచిర్యాల జిల్లా శివ్వారంలో అమర్చిన విద్యుత్ వైరుకు తాకి రాయల్ బెంగాల్ టైగర్ ప్రాణాలు కోల్పోయింది. అప్పుడు కూడా పులి చర్మం, గోళ్లు అమ్ముతుండగా ఘటన వెలుగులోకి వచ్చింది.
- చెన్నూరు పరిధిలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చు కే-4 అనే ఆడపులి నడుముకు తగిలింది. ఆ పులి జీవించి ఉందా? లేదా? ఇప్పటికీ తేలడం లేదు.

క్లుప్తంగా

ఆదివాసీ సేన రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలి


స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ సేన ఆధ్వర్యంలో ఈ నెల 28, 29న ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కోవా దౌలత్‌రావ్ అన్నారు. ఆదివారం మండలంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదివాసీ ప్రాంతంలోని వనరులపైన ఉన్న ప్రేమ ఆదివాసీలపై లేదన్నారు. 75ఏళ్లుగా కనీస వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారు. ఆదివాసీలపై దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్ర అనిల్, రాష్ట్ర నాయకులు రాయిసిడాం జంగు పటేల్, ఉయికే రవి ఉన్నారు.

'ఏలేటి' ఇంటిపై నోటీస్


మహేశ్వర్‌రెడ్డి ఇంటిపై నోటీస్ అతికిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఈనెల 21న మీడియా సమావేశంలో నిరాధార ఆరోపణలు చేసిన ఏఐసీసీ అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నోటీసులు ఇవ్వడానికి మహేశ్వర్ రెడ్డి ఇంటికి ఆదివారం వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటిగోడపై అంటించారు. మహేశ్వర్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు ఫొటోలు, వీడియోలు ఉంటే ఈనెల 28న పట్టణ ఎస్సై గంగాధర్‌కు ఇవ్వాలని పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు.

ఖానాపూర్‌లో పట్టపగలే చోరీ


విచారణ చేస్తున్న పోలీసులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలోని మెయిన్‌రోడ్డు పక్కనే గల రెండు ఇళ్లల్లో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. ఎస్సై ఆర్.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో పక్కపక్కనే ఉన్న మాజీ జెడ్పీటీసీ కారింగుల విజయరాములుతో పాటు బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బక్కశెట్టి కిశోర్ నివాసాల్లో చొరబడి గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆయా నివాసాల్లోని కుటుంబీకులు ఇంటి నుంచి వెళ్లిన అరగంట వ్యవధిలోనే చోరీకి పాల్పడ్డారు. విజయరాములు ఇంట్లో తులం 3 గ్రాముల బంగారంతో పాటు రూ.20వేల నగదు, కిశోర్ నివాసంలో రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ నారాయణనాయక్ పరిశీలించారు.

కేంద్రీయలో ప్రవేశాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, మంచిర్యాలలో విద్యాలయాలు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఆదిలాబాద్ కేంద్రీయ విద్యాలయం

బజార్‌హత్నూర్: కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశాలు మార్చి 27 ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభమవుతాయి. చివరితేది ఏప్రిల్ 17 సాయంత్రం 7గంటల వరకు అవకాశం కల్పించారు. ఈ విద్యాలయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యత ఉంటుంది. అడ్మిషన్ పొందే విద్యార్థి 2023 మార్చి 31 నాటికి 6 ఏళ్ల వయస్సు దాటి ఉండాలి. వికలాంగులకు మాత్రం రెండేళ్లు వరకు వయస్సు సడలింపు కల్పించారు.

ప్రాధాన్యత క్రమం..
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు , మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.
- కేంద్ర ప్రభుత్వ రంగ అనుబంధ సంస్థ (బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంకు, పోస్టల్ తదితర) ఉద్యోగుల పిల్లలకు రెండవ ప్రాధాన్యత.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడవ ప్రాధాన్యత ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు (ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్ తదితర) ఉద్యోగుల పిల్లలకు నాల్గో ప్రాధాన్యత.
- మిగిలిన వారికి ఐదో ప్రాధాన్యతగా ప్రవేశాలు కల్పిస్తారు.

- విద్యాలయ చైర్మన్(కలెక్టర్) రెండు సీట్లను ప్రతిపాదించవచ్చు.
- వారు ప్రతిపాదించే సీట్లు కేవీఎస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.

మొదటి నోటిఫికేషన్
- మార్చి 27 ఉదయం 10గంటల నుంచి ఏప్రిల్ 17 సాయంత్రం 7గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మొదటి మెరిట్ లిస్టు : ఏప్రిల్ 20 (ఏప్రిల్ 21 నుంచి 1వ తరగతి ప్రవేశాలు)
- రెండవ మెరిట్ లిస్టు : ఏప్రిల్ 28న (మొదటి లిస్టులో మిగిలిన సీట్లు)
- మూడవ మెరిట్ లిస్టు : మే 4న (రెండవ లిస్టులో మిగిలిన సీట్లు)

ఎంపిక విధానం
- ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కేంద్రీయ విద్యాలయం సంఘటన్ (కేవీఎస్) నుంచి 80 మంది విద్యార్థుల ఎంపిక జాబితాను నేరుగా విద్యాలయానికి పంపుతారు. జాబితాను కేవీ అధికారులు సంబంధిత వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.
- లిస్టులో ఉన్నవారు మాత్రమే తమ ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో కేవీలో సంప్రదించి ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది. ప్రవేశాలు పొందుటకు నోటిఫికేషన్ రోజు నుంచి 30రోజుల గడువు ఇస్తారు.
- ఎలాంటి డ్రా అయిన చైర్మన్ సూచించిన అధికారితో పాటుగా వీఎంసీ మెంబర్, ప్రిన్సిపాల్ నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు (వీరిలో ఒకరు విద్యాహక్కు చట్టం ప్రకారం సీటు పొందేవారు) ఒక విద్యార్థి సమక్షంలో ఎంపిక నిర్వహిస్తారు.
- కేంద్రీయ విద్యాలయం నిబంధనల మేరకు ఎస్సీలకు 15శాతం ఎస్టీలకు 7.5 శాతం, ఆర్థికంగా బలహీనంగా (ఈడబ్ల్యూఎస్) ఉన్న కుటుంబాల పిల్లలకు 27శాతం సీట్లు, వికలాంగులకు 3శాతం సీట్లు కేటాయించారు.

ఫీజు వివరాలు...
- అడ్మిషన్ పొందే విద్యార్థులు రూ.25 ప్రవేశ రుసుం చెల్లించాలి.
- ఒకటో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థి వరకు నెలకు రూ.500 చెల్లించాలి.
- 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కంప్యూటర్ బోధన కోసం అదనంగా నెలకు రూ.100 చెల్లించాలి.
- 9, 10వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.200 చెల్లించాలి.
- 11, 12వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.400 చెల్లించాలి.

దరఖాస్తు చేసుకునే విధానం..

kvsonlineadmission.kvs.gov.in లేదా kvssangathan.nic.in ద్వారా లాగిన్ కావాలి.

- కేంద్రీయ విద్యాలయంలో సాధారణంగా ప్రతి సంవత్సరం ఒకటో తరగతికి మార్చి నెలలో అడ్మిషన్‌లు ఇస్తారు.
- రెండు సెక్షన్‌లలో 40 మంది విద్యార్థుల చొప్పున 80 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.
- రిజిస్ట్రేషన్ కోసం పుట్టిన తేది, కులం నివాసం, వృత్తి ధ్రువీకరణ పత్రాల సమాచారాన్ని తప్పక పొందు పరచాలి.
- ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు) బీపీఎల్ కింద దరఖాస్తు చేసుకునేవారు. ధ్రువీకరణ పత్రం సంఖ్యను నమోదు చేయాలి. పీహెచ్‌సీ వారు వికలాంగుల ధ్రువీకరణ పత్రాలను పొందుపరచాలి.
- బీసీ కులస్తులైతే ఓబీసీ సర్టిఫికెట్ ఉండాలి.
- ఏక సంతానం(కూతురు) గల వారు నేరుగా విద్యాలయంలోనే దరఖాస్తు చేసుకొనే వీలు కల్పించారు. మరో సంతానం లేనట్లుగా నోటరీ ద్వారా జారీ చేసిన అఫిడవిట్‌ను అందజేయాలి. ఒకవేళ ఎక్కువ దరఖాస్తులు వస్తే డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తారు.
- 2 నుంచి 10వ తరగతులల్లో (11వ తరగతిలో కూడా) ఖాళీ సీట్లకు ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 12వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సాంబశివరావు, తదితరులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

నస్పూర్(మంచిర్యాల): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు యత్నిస్తున్న మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా బీఆర్ఎస్‌తో పాటు కలిసి వచ్చే పార్టీలతో పని చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీని ప్రశ్నించే వారిపైకి ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దొంగల ఇంటి పేరులో మోదీ ఉందని రాహుల్‌గాంధీ విమర్శించారనే నెపంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ హఠావో.. దేశ్‌కీ బచావో నినాదంతో ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. మే14న లక్ష మందితో కొత్తగూడెంలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

'గుర్తింపు'ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలి

ప్రభుత్వరంగ సంస్థల మాదిరిగా సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం యత్నిస్తోందని సాంబశివరావు ఆరోపించారు. సింగరేణిని నిలబెట్టుకోవాలంటే వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. ఇందారం క్రాస్ రోడ్డు నుంచి సీసీసీ న్యూ కమ్యూనిటీ హాల్ వరకు బైక్ ర్యాలీ ద్వారా బయల్దేరి శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సింగరేణి కార్మికుని విగ్రహానికి, సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల కోసం అనేక హక్కులు సాధించిపెట్టిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. సింగరేణిని ప్రైవేటుపరం చేసే అధికారం కాని ఆలోచన కాని లేదని ప్రధాని మోదీ గతంలో అన్నారని గుర్తు చేశారు. సింగరేణికి చెందిన నాలుగు బ్లాకులను వేలానికి ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. రోజుకో పార్టీ మారే స్థానిక ఎమ్మెల్యే కమ్యూనిస్టుల పని అయిపోయిందని అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తమది సిద్ధాంతాలను నమ్ముకున్న పార్టీ అని పదవుల కోసం వెంపర్లు ఆడే పార్టీ కాదన్నారు.

మతోన్మాద శక్తుల చేతుల్లో..

దేశం కొంతమంది మతోన్మాద శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలతో వివిధ రాష్ట్రాల్లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యతగా ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా సమితి సభ్యులు చంద్రశేఖర్, లింగం రవి, మండల కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, విలాస్, బద్రి సత్యనారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి


పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్


హోమంలో పాల్గొన్న భక్తులు

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఇంద్రవెల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇంద్రాదేవి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కలశ స్థాపన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అంతకుముందు ప్రత్యేక పూజల మధ్య కలశ స్థాపన పూజలు చేశారు. ఇందులో ఆలయ పూజారి చహకటి సూర్యరావ్, ఆలయ కమిటీ అధ్యక్షులు చహకటి నాగోరావ్, నాయకులు కనక తుకారం, మర్సుకోల తిరుపతి, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, జుగ్నాక్ భరత్ ఉన్నారు.

అన్నదాతా.. అందుకో చేయూత

- జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌లో నిబంధనలు సరళతరం
- రుణ వ్యయం ఎక్కువ కారణంగా ఆశించిన స్థాయిలో ముందుకు రాని రైతులు
- పథకం విధివిధానాల్లో సవరణ
- అన్ని సామాజిక వర్గాల వారు రుణం పొందే అవకాశం



నేరడిగొండ: మాంసం ఉత్పత్తి వనరులను విస్తరించి, రైతుల ఆదాయం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోంది. గొర్రెలు, మేకలు, కోళ్ల సహా ఐదు రకాల యూనిట్లు కేటాయిస్తోంది. ఒక్కో యూనిట్ విలువ రూ.కోటి కాగా.. ఇందులో సగం రాయితీ ఉంటుంది. ఏడాది కిందట ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా.. రుణ వ్యయం ఎక్కువగా ఉండటంతో ఆశించిన స్థాయిలో రైతులు ముందుకు రాలేదు. దీంతో పథకం విధివిధానాలను సవరించారు. నూతన మార్గదర్శకాల ప్రకారం రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం అందనుంది. గొల్ల, కుర్మల ఆదాయాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల వారికి ఈ రుణం అందించనుంది. పశు సంవర్ధక శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను తేల్చనున్నారు.

ఇదీ పాత విధానం..

పాడి పంటలతో పాటు రైతుల ఆదాయం మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని రూపొందించింది. రూ.కోటి రుణంలో 50 శాతం రాయితీ రూ.50 లక్షలు, రూ.40 లక్షలు బ్యాంకు రుణం కాగా, రూ.10 లక్షలు లబ్ధిని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో దరఖాస్తు చేసుకుంటే 500 ఆడ, 25 మగ జాతి గొర్రెలు కొనుగోలు చేయాలి. కొత్తగా షెడ్డు నిర్మించుకోవడం, దాణా కోసం గడ్డి పెంపకం చేసుకోవాలి. వ్యక్తి, సంఘం సభ్యులుగా కూడా రుణం పొందవచ్చు.

ఐదు విభాగాలుగా..

ఇప్పటి వరకు రూ.కోటి రుణం మంజూరు చేసేవారు. అయితే అది పెద్ద మొత్తం కావడంతో లబ్ధిదారులు సమకూర్చుకోలేరని, బ్యాంకులు కూడా రుణం ఇవ్వలేవన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఔత్సాహికులకు రుణం మంజూరు చేసేందుకు నిబంధనలు సరళతరం చేశారు. విభాగాలుగా యూనిట్లను విభజించారు. 105 గొర్రెలకు రూ.12 లక్షలు, 210 గొర్రెలకు రూ.40 లక్షలు, 315 గొర్రెలకు రూ.60 లక్షలు, 420 తీసుకుంటే రూ. 80 లక్షలు, 525 గొర్రెలకు రూ.కోటి రుణాన్ని అందించనున్నారు.

అర్హులు ఎవరంటే..
- మాంసం ఉత్పత్తిని పెంచడానికి ఉద్దేశించిన ఈ పథకానికి అన్ని సామాజిక వర్గాల ప్రజలు అర్హులే.
- యూనిట్ స్థాపనకు సొంత స్థలం కలిగి ఉండాలి.
- 18 ఏళ్ల నిండి 55 ఏళ్లలోపు ఉన్నవారు nlm.udayamimitra.in పోర్టల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఒక కుటుంబం నుంచి ఎంత మందైనా యూనిట్లు పొందవచ్చు.
- ఆన్‌లైన్ దరఖాస్తులను పశు సంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.
- రుణం ఇచ్చేందుకు బ్యాంకర్ల అనుమతి తప్పనిసరి.
- ఐదు విభాగాల్లో దేనికైనా దరఖాస్తు చేసుకొని రుణం తీసుకోవచ్చు.

ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు రుణం పెద్ద మొత్తంలో తీసుకోవాల్సి ఉండటంతో చాలా మంది ఆసక్తి ఉన్నా వెనుకంజ వేశారు. ప్రస్తుతం ఐదు కేటగిరీలుగా విభజించారు. దేనికైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం కల్పించిన రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కిషన్, జిల్లా పశువైద్యాధికారి, ఆదిలాబాద్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


కద్తారం రమేశ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సయ్యద్ ముజాహిద్ వివరాల ప్రకారం... కద్తారపు రమేశ్ (33) ఇచ్చోడలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇనుప దూలానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి


భీమేశ్ మృతదేహం

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి యువకుడు మృతి చెందిన విషాదకర సంఘటన మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన సంగ భీమేశ్(24) ఆదివారం తన వ్యవసాయ పొలంలో మధ్యాహ్నం వరకు మందుచల్లాడు. అనంతరం గోదావరిలో స్నానం చేసేందుకు దిగాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతి చెందాడు. భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపాడు. భీమేశ్‌కు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జ్వరంతో విద్యార్థిని మృతి


మల్లేశ్వరి (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో విద్యార్థిని మృతిచెందిన సంఘటన మండలంలోని హీరాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... హీరాపూర్ గ్రామానికి చెందిన తొడసం నాగోరావ్, లక్ష్మీబాయి దంపతుల కూతురు మల్లేశ్వరి (10) ఉట్నూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. ఆరోగ్యం బాగలేక గత కొన్ని రోజులుగా ఇంట్లోనే ఉంటోంది. నాలుగు రోజులుగా జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. శనివారం రాత్రి జ్వరం తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

కర్ణాటకలో అన్ని స్థానాల్లో పోటీచేసే సత్తా ఉందా?

- బీఆర్ఎస్‌కు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సవాల్
- అడెల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న రఘునందన్‌రావు

సారంగాపూర్: కర్ణాటక రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉందా? అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని ఆదివారం సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనను ఆలయ అధికారులు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్రలో అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కర్ణాటకలో సొంతంగా పోటీచేస్తారా? జేడీఎస్, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటారా? లేదా.. సింగిల్‌గా పోటీ చేస్తారా? స్పష్టం చేయాలన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేస్తే ప్రజా స్వామ్య పాలనకు దుర్దినం అన్న సీఎం కేసీఆర్, అసెంబ్లీలో గతంలో అదే పార్టీలో ఎమ్మెల్యేలుగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ కాగితాలు చించిపారేస్తే ఎందుకు సస్పెండ్ చేశారో? చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకే తీరు ఘటనలపై ద్వంద్వ వైఖరి అవలంభించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఆయన వెంట స్థానిక నాయకులున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ అగ్రకాలనీలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం... మహేందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వేరే గ్రామానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పేశారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


శిక్షణ పొందిన మహిళలతో జెడ్పీ చైర్మన్

ఇంద్రవెల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హెల్ప్ వీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీపార్లర్ శిక్షణ పొందిన 20మంది మహిళలు, యువతులకు ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మంచి ఉన్నత చదువులు చదవాలన్నారు. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో స్వయం ఉపాధిని కల్పించేందుకు హెల్ప్ వీల్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అతీష్ కాంబ్లే, భాస్కర్ బాలేరావ్, నాయకులు మర్సుకోల తిరుపతి, బాబా, గణేష్, సంతోష్, పప్పేష్‌కుమార్ ఉన్నారు.